క్లుప్తంగా

ఫాదర్స్ డేకు కళా వందనం



ముత్తుకూరు : మండలంలోని నారికేళపల్లి పంచాయతీలో సుబ్బారెడ్డిపాళెం యూపీస్కూల్ తెలుగు పండిట్ సోమా పద్మారత్నం శనివారం మర్రి ఆకుపై కార్వింగ్ పద్ధతిలో తండ్రి, బిడ్డల చిత్రాన్ని రూపొందించారు. ఈనెల 18న ఫాదర్స్ డే సందర్భంగా ఈ చిత్రాన్ని ఆవిష్కరించారు.

రిటైల్ మెగా రుణమేళా



నెల్లూరు(బారకాసు): ప్రాజెక్ట్ పవర్ పథకంలో భాగంగా ఎమ్మెస్సెమ్ఈ, రిటైల్ మెగా రుణమేళాను యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నెల్లూరు రీజినల్ కార్యాలయ ఆధ్వర్యంలో నగరంలోని ఉమేష్ చంద్ర మెమోరియల్ కాన్ఫరెన్స్ హాల్లో శనివారం నిర్వహించారు. ముంబైలోని కేంద్ర కార్యాలయ జనరల్ మేనేజర్ జ్ఞానరంజన్‌సారంగి, రీజినల్ మేనేజర్ జోగారావు హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా సారంగి మాట్లాడారు. దేశ ఆర్థికాభివృద్ధికి యూనియన్ బ్యాంక్ ఎల్లవేళలా సహకారాన్ని అందిస్తోందని చెప్పారు. అనంతరం సీఎస్సార్‌లో భాగంగా అయ్యప్పగుడి సమీపంలోని ప్రగతి చారిటీస్‌కు ఎయిర్ కూలర్‌ను అందజేశారు.

2న భజన, వక్తృత్వ పోటీలు

నెల్లూరు(బృందావనం): గురుపూర్ణిమను పురస్కరించుకొని సుజాతమ్మ కాలనీలోని కృష్ణ యోగ మందిరంలో భజన, వక్తృత్వ పోటీలను జూలై రెండున నిర్వహించనున్నామని గణపతి సచ్చిదానంద కృష్ణ జ్ఞానబోధ సభ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ సర్వేపల్లి అజయకుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గణపతి సచ్చిదానందస్వామి దివ్యనామ సంకీర్తనతో భజన పోటీలను నిర్వహించనున్నామని, దీనికి వయోపరిమితి లేదని చెప్పారు. దత్తాత్రేయ స్వామి అంశంపై వక్తృత్వ పోటీలను నిర్వహించనున్నామని, పాల్గొనేందుకు ఐదు నుంచి 18 ఏళ్లలోపు వారు మాత్రమే అర్హులన్నారు. వివరాలకు 94415 48655, 86135 00294 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

గుర్తుతెలియని వృద్ధురాలి మృతి

నెల్లూరు(క్రైమ్): అపస్మారక స్థితిలో ఓ వృద్ధురాలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల సమాచారం మేరకు.. వేదాయపాళెంలోని ఎన్టీఆర్ విగ్రహ సమీపంలో గల బాలాజీ హార్డ్‌వేర్ షాపు ఎదుట గుర్తుతెలియని వృద్ధురాలు (60) అపస్మారక స్థితిలో శుక్రవారం పడిపోయారు. గమనించిన దుకాణ యజమాని సత్యనారాయణ ఆమెను 108 సాయంతో జీజీహెచ్‌లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి చెందారు. ఘటనపై వేదాయపాళెం పోలీసులకు 26 / 3 సచివాలయ వీఆర్వో సాంబశివ శనివారం ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని పోలీసులు పరిశీలించారు. మృతురాలి వద్ద ఎలాంటి వివరాలు లభ్యం కాలేదు. మృతదేహాన్ని మార్చురీకి తరలించి పోలీసులు కేసు నమోదు చేశారు. మృతురాలి వివరాలు తెలిసిన వారు వేదాయపాళెం పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని ఇన్‌స్పెక్టర్ నారాయణ కోరారు.

పరిహారాన్ని పెంచాలని వినతి

నెల్లూరు(దర్గామిట్ట): జాతీయ రహదారి ఏర్పాటుతో కోల్పోతున్న భూములకు పరిహారాన్ని పెంచాలని పలువురు కోరారు. ఈ మేరకు కలెక్టర్ హరినారాయణన్‌కు వినతిపత్రాన్ని శనివారం అందజేశారు. మర్రిపాడు మండలం చుంచులూరు నుంచి కృష్ణపట్నానికి జాతీయ రహదారి అనంతసాగరం మండలం వెంగంపల్లి, లింగంగుంట, పాతదేవరాయపల్లి, తదితర గ్రామాల మీదుగా వెళ్తుందన్నారు. దీనికి నష్టపరిహారాన్ని పెంచాలని కోరారు.

స్పాస్టిక్స్ సెంటర్‌లో ఫాదర్స్ డే

నెల్లూరు(అర్బన్): మద్రాస్ బస్టాండ్ సమీపంలోని రెడ్‌క్రాస్ స్పాస్టిక్స్ సెంటర్‌లో ఫాదర్స్ డేను రాయల్ లియో లయన్స్ క్లబ్ ఆఫ్ నెల్లూరు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. రాధాకృష్ణయ్య జ్ఞాపకార్థం పది మంది తల్లులు, తండ్రులను రాయల్ లియో లయన్స్ క్లబ్ ఆఫ్ నెల్లూరు ప్రెసిడెంట్ వర్షిత, కార్యదర్శి అభినవ్ ఆధ్వర్యంలో సత్కరించారు. రెడ్‌క్రాస్ ఎమ్సీ మెంబర్ రాజేంద్రప్రసాద్, స్పాస్టిక్స్ సెంటర్ ప్రిన్సిపల్ గుర్నాథరావు, గాయత్రి, తదితరులు పాల్గొన్నారు.



➡ ఈమె పేరు పసుపులేటి అంకమ్మ. కొడవలూరు మండలం కొత్తవంగల్లుకు చెందిన ఈమెకు ఒక కుమారుడు, ఒక కుమార్తె సంతానం. వీరికి అర ఎకరా మాత్రమే పొలం ఉండడంతో దానిని సాగు చేసినా కుటుంబం గడిచేది కాదు. దీంతో భర్తతో కలిసి ఆమె కూడా కూలి పనులకు వెళ్లేది. కుమార్తెను చదివించే స్తోమత లేక స్కూలు మాన్పించేశారు. కుమారుడ్ని చదివిస్తుండగా ఓ ప్రమాదంలో రెండు కాళ్లు నుజ్జయ్యాయి. ఈ సమయంలో ఆరోగ్యశ్రీ ద్వారా శస్త్ర చికిత్స చేయించినప్పటికీ వైకల్యం తప్పలేదు. దీంతో ఆ కుటుంబ పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. అదే సమయంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యారు. వికలాంగుడైన కుమారుడికి పింఛన్ మంజూరైంది. ప్రస్తుతం అతను డిగ్రీ చేస్తుండగా విద్యాదీవెన పథకం మంజూరు చేశారు. అర ఎకర పొలం మాత్రమే ఉన్నా రైతు భరోసా నగదు వస్తోంది. ఆమె భర్త కూలి పనులు లేని సమయంలో ఆటో నడుపుతుండగా వాహన మిత్ర మంజూరైంది. ఇవన్నీ కూడా ఎవరి చుట్టూ తిరగకుండానే వలంటీర్ల సాయంతో ఇంటికి చేరుతోంది. దీనివల్ల వారు కష్టాల నుంచి బయటపడ్డారు. కుమార్తెకు వివాహం చేశారు. తమ కుమారుడి గురించి చింతించాల్సిన బాధ తప్పిందని, మా కుటుంబాన్ని సీఎం జగనన్న అన్నివిధాలా ఆదుకున్నారని ఆనందంగా చెప్పారు.



➡ ఈమె పేరు మార్తూరు లక్ష్మి. నార్తురాజుపాళేనికి చెందిన రజక వృత్తిదారు. ఈమె భర్త అనారోగ్యంతో మృతిచెందారు. ఒక కుమారుడు ఉండగా, చదివించే స్తోమత లేక అర్థాంతరంగా మాన్పించేశారు. రజక వృత్తి ద్వారా కుటుంబాన్ని నెట్టుకురావడం కష్టంగా మారడంతో అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ ప్రభుత్వంలో ఆమెకు వితంతు పింఛన్ మంజూరు కావడంతో పాటు చేదోడు పథకం మంజూరు చేశారు. దీని ద్వారా ఏడాదికి రూ.10 వేలు ఇస్తుండడంతో సొంతంగా ఇస్త్రీ పెట్టె, బండి తదితరాలు కొనుగోలు చేసి ఇంటి వద్దే లాండ్రీ దుకాణం పెట్టుకున్నారు. దీంతో అప్పుల చేయాల్సిన పరిస్థితి నుంచి గట్టెక్కి కుటుంబాన్ని సజావుగా నడుపుకోగలుగుతున్నారు. ప్రస్తుతం ఎంతో సంతోషంగా ఉన్నానని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఎంతగానో రుణపడి ఉన్నామని ఆమె తెలిపారు.



➡ ఈయన పేరు నాదెండ్ల నాగేశ్వరరావు, కొడవలూరు మండలం కొత్తవంగల్లు గ్రామానికి చెందిన ఈయనకు మూడెకరాల పొలం ఉంది. భార్య, ఒక కుమార్తె ఉన్నారు. వ్యవసాయ ఖర్చులు పెరిగిన నేపథ్యంలో పొలాన్ని సాగు చేయడం ద్వారా కుటుంబాన్ని పోషించడం కష్టంగా మారింది. కుమార్తెను చదివించుకోవడం కూడా పెనుభారంగా పరిణమించింది. ప్రతి ఏడాది ఎంతో కొంత అప్పు చేయాల్సిన పరిస్థితి ఉండేది. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక కుమార్తెకు అమ్మఒడి మంజూరైంది. నాగేశ్వరరావుకు కాపు నేస్తం, రైతు భరోసా మంజూరు చేశారు. ఈ పథకాలు వారి కుటుంబానికి ఆసరాగా మారాయి. రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, సచివాలయ వ్యవస్థల ద్వారానే తమ కుటుంబం కష్టాల నుంచి బయట పడిందని ఆయన సంతోషంగా చెప్పారు.

ఇంటి ముంగిటకే సంక్షేమ ఫలాలు

- అర్హత ఉంటే వెతుక్కుంటూ వస్తున్న పథకాలు
- ప్రభుత్వాఫీసుల చుట్టూ తిరిగే రోజులకు చెల్లుచీటీ
- గ్రామస్థాయిలో ఆదర్శపాలన



ప్రతి చిన్న పనికి మండల కేంద్రానికి పరుగులు తీసి కాళ్లరిగేలా తిరిగే వ్యయప్రయాసలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం స్వస్తి పలికించింది. సచివాలయ వ్యవస్థతో గ్రామస్థాయిలో వినూత్న మార్పులకు శ్రీకారం చుట్టింది. అర్హులు ఏ మారుమూల ఉన్నా వెతికి ఇంటి ముంగిటకే పథకాలను చేరువయ్యేలా చేసింది. ఎలాంటి సమస్యనైనా గ్రామంలోనే పరిష్కరించుకొనే వెసులుబాటు కల్పించింది. పథకాల కోసం నేతల చుట్టూ తిరిగి విసిగి వేసారే సంప్రదాయానికి చెల్లుచీటీ పలికింది. సంక్షేమం ఇంటికే అందించడంతో పాటు ఏ సర్టిఫికెట్‌నైనా గ్రామంలోనే సకాలంలో పొందే అవకాశం కల్పించింది. వ్యయప్రయాసలు భరించలేక పథకాలు మా కొద్దులే బాబు అనే వారు లేకుండా చేసిన ఘనత సచివాలయ వ్యవస్థకే దక్కింది.



నార్తురాజుపాళెం-1 సచివాలయం



కొడవలూరు మండలంలో ఇంటికే వెళ్లి పింఛన్ నగదును అందజేస్తున్న వలంటీర్ (ఫైల్)

కొడవలూరు: ఒక్కో సచివాలయంలో రూ.కోట్లలో సంక్షేమం అందడంతో పాటు అన్ని సమస్యలను గ్రామంలోనే సులువుగా పరిష్కరించుకొంటున్నారు. నార్తురాజుపాళెం-1 సచివాలయాన్ని పరిశీలించగా, ఆసరా, అమ్మఒడి, చేయూత, పింఛను, వాహన మిత్ర, కాపు నేస్తం తదితర 21 రకాల సంక్షేమ పథకాలు 2,600 మందికి అందించారు. నగదు రూపంలోనైతే వీరికి రూ.7 కోట్ల 31 లక్షల 71 వేల 898 లు నేరుగా అందింది. అంతేకాకుండా నివేశన స్థలాలు, ఇళ్ల మంజూరు ద్వారా 95 మంది రూ.2.14 కోట్ల లబ్ధి పొందారు. మొత్తం మీద ఈ ఒక్క సచివాలయం పరిధిలోనే ప్రభుత్వం ద్వారా 3,503 మంది రూ.9 కోట్ల 53 లక్షల 79 వేల 898 లు లబ్ధి జరిగింది. వీరంతా కూడా ఎలాంటి వ్యయప్రయాసలు, సిఫార్సులు లేకుండానే వలంటీర్ల సాయంతో ఇంటికే పథకాలు అందించారని చెబుతున్నారు. ఏ లబ్ధిదారును పలుకరించినా సచివాలయాలు కల్పతరువులు అని చెబుతున్నారు.

నార్తురాజుపాళెం సచివాలయ పరిధిలో..

పథకం పేరు	లబ్ధిదారులు	చేకూరిన లబ్ధి
వైఎస్సార్ పెన్షన్ కానుక	435	రూ.3,04,56,500
అమ్మఒడి	273	రూ.94,87000
జగనన్న వసతిదీవెన	144	రూ.19,48,414
వైఎస్సార్ చేయూత	183	రూ.57,00000
రైతు భరోసా	160	రూ.53,83,500
జగనన్న విద్యాదీవెన	230	రూ.63,83,863

గ్రామస్థాయిలోనే పాలన



సచివాలయ వ్యవస్థ వల్ల గ్రామస్థాయిలోనే పరిపాలన జరుగుతోంది. ప్రభుత్వానికి సంబంధించిన ఏ పనికైనా మండల కేంద్రానికి పదేపదే తిరగకుండా గ్రామంలోని పరిష్కరించుకునే వెసులుబాటు సమకూరింది. దేశంలో ఎక్కడా లేనివిధంగా మన రాష్ట్రంలో అమలవుతున్న ఈ వ్యవస్థ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా మారింది. దీనికితోడు పేదరికమే ప్రామాణికంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి వాటిని అర్హులకు సచివాలయాల ద్వారా అందేలా చేశారు. దీంతో పేదల జీవనం ఎంతగానో మెరుగు పడింది.

– పి.సుబ్రహ్మణ్యం, ఎంపీడీఓ, కొడవలూరు

పేదపిల్లలకు వరం.. విద్యాకానుక

- ఏఎంఓ శాంతకుమారి



విద్యాకానుక కిట్లు అందుకున్న విద్యార్థులతో ఏఎంఓ

పొదలకూరు : జగనన్న విద్యాకానుక పేదపిల్లల పాలిట వరంగా మారిందని అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్(ఐటీడీఏ) వై.శాంతకుమారి పేర్కొన్నారు. మండలంలోని అమ్మవారిపాళెం, మొగళ్లూరు గ్రామాల్లో గిరిజన ప్రాథమిక పాఠశాలలను ఏఎంఓ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు విద్యాకానుక కిట్లను అందజేశారు. బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాల్సిందిగా సూచించారు. నాడు-నేడు పథకం కింద పాఠశాలల రూపురేఖలు మారుతున్నాయన్నారు. కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వం పాఠశాలలను తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. జగనన్న గోరుముద్ద, పిల్లల హాజరు రికార్డులను పరిశీలించారు. ఆమె వెంట ఎడ్యుకేషనల్ సెక్రటరీలు రాజేంద్రప్రసాద్, రేబేదాబేగం, పాఠశాలల హెచ్‌ఎంలు సుకన్య, శ్రీనివాసులు, అంగన్‌వాడీ టీచర్లు జయంతి, ప్రసన్న ఉన్నారు.

విద్యార్థులకు అభినందన



కొడవలూరు: మండలంలోని చంద్రశేఖరపురం ఏకలవ్య గిరిజన సంక్షేమ గురుకుల కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు ఇంటర్‌లో ప్రతిభ కనబరిచి 'జగనన్న ఆణిముత్యాలు' పురస్కారం దక్కించుకున్నారు. బైపీసీలో సీహెచ్.పూజిత, ఎంపీసీలో ఎన్.మధులత జిల్లాలోనే గిరిజన గురుకుల కళాశాలల్లో అత్యధిక మార్కులు సాధించగా, వీరికి రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చేతుల మీదుగా నెల్లూరులో శనివారం రూ.50 వేల నగదు, జ్ఞాపిక, ప్రశంసా పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీఓ రాణి మందా, డీటీడబ్ల్యూఓ పరిమళ, గురుకులం ప్రిన్సిపల్ టి.విష్ణుప్రియ ఇద్దరు విద్యార్థినులను ప్రత్యేకంగా అభినందించారు.

బడుగుల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్న

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

ఇందుకూరుపేట: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఇందుకూరుపేటలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రసన్న శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. స్థానికంగా ఏమైనా సమస్యలు ఉన్నాయా.. అని ఆరాతీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎక్కడైనా రోడ్లు, డ్రెయిన్లు లేవని గుర్తిస్తే సచివాలయ నిధులు మంజూరు చేసి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. పేదల ఆర్థికాభివృద్ధి కోసమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. గ్రామాల్లో సచివాలయాలు ఏర్పాటు చేసి ప్రజల ఇళ్ల వద్దకే సంక్షేమ పథకాలు అందించడంలో దేశ చరిత్రలోనే రాష్ట్ర ప్రభుత్వం ప్రథమ స్థానంలో ఉందన్నారు. జగనన్న విద్యాకానుక, అమ్మఒడి, గోరుముద్ద, వసతి దీవెన వంటి పథకాల ద్వారా విద్యావ్యవస్థలో పెనుమార్పులను సీఎం జగన్ తీసుకొచ్చారన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు సంక్షేమ పాలనకు పట్టం కట్టాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుబ్బయ్య, ఎంపీడీఓ నాగేంద్రబాబు, సీఐ రామకృష్ణారెడ్డి, నేతలు భాస్కర్‌నాయుడు, రాజా, వాసు, చక్రి, సర్పంచ్ పద్మావతమ్మ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వెంకటాచలం: మోటార్ బైక్ అదుపుతప్పి పడడంతో ఓ వ్యక్తి గాయపడిన ఘటన మండలంలో కసుమూరు వద్ద శనివారం జరిగింది. నెల్లూరు నగరానికి చెందిన విష్ణు పనినిమిత్తం బైక్‌పై కసుమూరుకు వచ్చాడు. తిరిగి నెల్లూరుకు వెళ్తుండగా కసుమూరు పంచాయతీ పరిధిలోని చింతలపాళెం సమీపంలో బైక్ అదుపుతప్పి పడింది. ఈ ప్రమాదంలో విష్ణుకు గాయాలవ్వగా చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ముగిసిన శిక్షణా తరగతులు

వెంకటాచలం: రాజీవ్ గాంధీ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యూత్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న వీఎస్‌యూలో విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధిని పెంపొందించేందుకు జరుగుతున్న శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. ఈ కార్యక్రమానికి హాజరైన వివిధ కళాశాలల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులకు వీఎస్‌యూ రిజిస్ట్రార్ డాక్టర్ పి.రామచంద్రారెడ్డి, ప్రిన్సిపల్ విజయానంద్‌కుమార్‌బాబు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఉదయ్‌శంకర్ చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు.

రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): సర్వేపల్లి నియోజకవర్గంలోని రెవెన్యూ సమస్యలను రెండున్నర నెలల్లో పరిష్కరించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదేశించారు. సర్వేపల్లి నియోజకవర్గంలోని రెవెన్యూ సమస్యలపై కలెక్టర్ హరినారాయణన్, జేసీ కూర్మనాథ్, ఆర్డీఓ మలోల, నియోజకవర్గ తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లతో రెండో సమీక్ష సమావేశాన్ని కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. మొదటి సమావేశంలో చర్చించిన కొన్ని అంశాలు పరిష్కారమయ్యాయని, ఇది మంచి పరిణామమని చెప్పారు. మిగిలిన వాటిని రానున్న 75 రోజుల్లో పరిష్కరించాలని సూచించారు. అసైన్డ్ భూములను ఎవరైతే సాగు చేసుకుంటున్నారో, నిబంధనల మేరకు వారికి పట్టాలివ్వాలని సూచించారు. కొంతమంది వీఆర్వోలు బాధ్యతాయుతంగా వ్యవహరించకపోవడంతో రైతుల సమస్యల పరిష్కారంలో జాప్యం జరుగుతోందని తెలిపారు. భూసేకరణ పరిహారంలో రైతులు నష్టపోకుండా సరైన ధర ఇవ్వాలని కోరారు. సమస్యలపై కలెక్టర్ క్రియాశీలకంగా స్పందించి, అజెండాను తయారు చేయించి చర్చించారని, సమావేశం ఫలవంతంగా జరిగిందన్నారు. నేలటూరు పునరావాసానికి సంబంధించిన మత్స్యకారులకు తీర ప్రాంతాల్లోనే స్థలాలను ఇవ్వాలని కోరారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. రెవెన్యూ అధికారుల దృష్టికి మంత్రి తీసుకొచ్చిన సమస్యలను 100 శాతం పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. భూ సమస్యలకు సంబంధించిన ప్రతిపాదనలను కలెక్టర్ కార్యాలయానికి ఈ నెల 27లోపు పంపాలని సూచించారు. సీపీఓ రాజు, తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఈకేవైసీ చేయించుకోవాలి



రైతులకు సూచనలు చేస్తున్న వ్యవసాయాధికారులు

మనుబోలు : రైతులందరూ తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని వ్యవసాయ శాఖ ఏడీఏ శివనాయక్ సూచించారు. మండలంలోని మడమనూరు, కొమ్మలపూడి, వీరంపల్లి గ్రామాల్లో ఈకేవైసీపై ఆయన శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ జూలైలో రైతుల అకౌంట్‌లో పీఎం కిసాన్ నగదు జమ అవుతుందని, దీని కోసం రైతులందరూ ఈకేవైసీ చేయించుకుని ఉండాలన్నారు. అలాగే రైతు భరోసా నగదు జమ కాని వారు ఆధార్ అప్‌డేట్ చేయించుకుని బ్యాంకు అకౌంట్‌కు పాసు పుస్తకంతో లింగ్ చేయించుకోవాలని సూచించారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి జహీర్ ఉన్నారు.

ఆంగ్ల పుస్తకాల వితరణ



పుస్తకాలు అందుకున్న విద్యార్థులతో హెచ్‌ఎం, దాత

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని రామచంద్రాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో 1, 2వ తరగతుల విద్యార్థులతో పాటు స్థానికంగా ఉన్న అంగన్‌వాడీ చిన్నారులకు బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన ముంగర వనజమ్మ ఆంగ్ల పుస్తకాలను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ ప్రాథమిక దశ నుంచే విద్యార్థులు ఆంగ్ల భాషపై పట్టు సాధించాలని సూచించారు. అనంతరం దాతను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నిర్మల, బ్రహ్మారెడ్డి, వేణు, మున్వర్, అహ్మద్, విజయకుమార్, రిసోర్‌పర్సన్ సుధీర్‌కుమార్, రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

కమనీయం.. కల్యాణం



వేడుకగా సాగుతున్న కల్యాణం

కోవూరు(విడవలూరు): మండలంలోని రామతీర్థంలో కొలువైన కామాక్షి సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారి కల్యాణం శనివారం కమనీయంగా జరిగింది. తొలుత ఆలయ అర్చకులు స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం శాస్త్రోక్తంగా కల్యాణ ఘట్టాన్ని జరిపించారు. భక్తులు విశేషంగా తరలివచ్చి స్వామి కల్యాణాన్ని తిలకించారు. కాగా ఆలయంలో గత వారం రోజులుగా బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. దీనిలో భాగంగా ప్రతిరోజు వివిధ రకాల దేవతామూర్తుల అలంకారంలో స్వామి, అమ్మవార్లు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి గ్రామ పురవీధుల్లో రథోత్సవం వేడుకగా సాగింది. ఉభయకర్తలుగా శంభుని కాపుల సంఘం నేత తంబి శ్రీనివాసులు వ్యవహరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి, దేవస్థానం చైర్మన్ నాటారు చంద్రయ్య, అర్చకుడు శ్రీకాంత్‌శర్మ, ఆలయ కార్యనిర్వహణాధికారి గమ్మినేని రామకృష్ణ పాల్గొన్నారు.



కూరగాయలతో ఏర్పాటు చేసిన శివలింగ ఆకృతులు



పూజా కార్యక్రమాల్లో రజత్‌కుమార్‌రెడ్డి